- పైలట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలో హడావుడి
- కంప్యూటర్లకే పరిమితమైన డిజిటల్ హెల్త్ ప్రొఫైల్
- రెండేళ్లు దాటినా అందని డిజిటల్ కార్డులు
- సిరిసిల్లలో 3.47 లక్షల మందికి పరీక్షలు



సిరిసిల్ల టీహబ్‌లోని మిషనరీలు

హెల్త్ ప్రొఫైల్ జాడేది?



ఆరోగ్య పరీక్షల కిట్‌లను అందిస్తున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎంతో ఆర్భాటంగా.. పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలో మొదలైన డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కంప్యూటర్లలో మాత్రమే నిక్షిప్తమైంది. ప్రభుత్వం మారడంతో హెల్త్ ప్రొఫైల్ ప్రాజెక్ట్ కథ ముగిసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా గత ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిస్థితి ముందుగా తెలిసి ఉంటే సత్వర చికిత్సకు దోహదపడుతుందని హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇం దులో భాగంగా రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల, ములుగు జిల్లాలను పైలట్ జిల్లాలుగా ఎంపిక చేసి ఎంతో హడావుడి చేశారు. సర్వే పూర్తి చేసి ఆన్‌లైన్‌లో సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. అయినా ప్రజలకు మాత్రం హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డులు అంద లేదు. ప్రభుత్వం మారిపోవడంతో హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమం మూలన పడినట్లు భావిస్తు న్నారు. హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమం కూడా వాయిదా పడుతూనే ప్రారంభోత్సవంవైపు అడుగులు వేసింది. 2021 డిసెంబరులోనే పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించాల్సి ఉండగా 2022 మార్చి 5న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ఆసుపత్రిలో అప్పటి మంత్రులు కే తారకరామారావు, ములుగు జిల్లాలో హరీష్‌రావు ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలోనే పరీక్షలు పూర్తి చేసినా డిజిటల్ హెల్త్ కార్డులు మాత్రం అందలేదు. ప్రస్తుతం రెండేళ్లు గడిచిపోయాయి. డిజిటల్ కార్డుల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలో 203 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీ బృందంలో ఒక ఏఎన్‌ఎం, ఇద్దరు ఆశావర్కర్లతోపాటు పర్యవేక్షకుడిగా మండల వైద్యాధికారిని నియమించారు. ఉదయం 7 గంటల నుంచి 11 వరకు ఇంటింటికి తిరిగి రక్త నమూనాలను సేకరించారు. ప్రతీ రోజు పది ఇళ్ల నుంచి 30 నుంచి 40 మంది రక్త నమూనాలను సేకరించి ప్రత్యేకయాప్‌లో సమాచారాన్ని ఎంట్రీ చేశారు. రక్త నమూనాలను మండలాల నుంచి జిల్లా కేంద్రంలోని టీ-హబ్‌కు చేరవేయడానికి 23 వాహనాలను వినియోగించారు. టి-హబ్‌లో 58 రకాల ఆరోగ్య పరీక్షలను చేయడానికి 27 మంది ల్యాబ్ టెక్నీషియన్లను వినియోగించుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కొత్త సాఫ్ట్ వేర్‌తో సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల పరిధిలో 18 ఏళ్ల పైబడిన వారు 3.80 లక్షల మంది ఉండగా 3.47 లక్షల మంది రక్త నమూనాలను సేకరించి సర్వే పూర్తి చేశారు.

● అందని డిజిటల్ కార్డులు

జిల్లాను గత ప్రభుత్వం ఈ హెల్త్ ప్రొఫైల్‌కు పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన తరువాత ఎంతో హడావుడి మొదలైంది. ముందుగా జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో డ్రైరన్ నిర్వహించారు. 30 బృందాలతో ఇంటింటికి వెళ్లి 800 మంది రక్త నమూనాలను సేకరించారు. సీబీపీ, ఎల్‌ఎఫ్‌టీ, ఆర్‌ఎఫ్‌టీ తదితర 30 రకాల పరీక్షలు చేసి ఫలితాలు అందించారు. సాఫ్ట్‌వేర్ నిర్వహణ, సాంకేతిక సమస్యలు, ఆరోగ్య సిబ్బందికి శిక్షణకు ఆధార్ లింక్‌తో ఫోన్ నంబర్లకు మేసేజ్‌లు పంపారు. విజయవంతంగా ముగియడంతో జిల్లా వ్యాప్తంగా సర్వేను ప్రారంభించి ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్ చేశారు. హెల్త్‌ప్రొఫైల్‌లో పరీక్షలు చేసినా వాటిని సంబంధిత వ్యక్తి పేరుతో అకౌంట్ క్రియేట్ చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. యూనిక్ ఐడీ నంబరు కేటాయించి డిజిటల్ హెల్త్ కార్డులను జారీ చేయాల్సి ఉండగా నిలిచిపోయింది. కొందరికి మాత్రం వాట్సప్ ద్వారా సమాచారం అందించారు. ఏదైనా అనారోగ్య సమస్యతో ఆసుపత్రికి వెళ్తే ఐడీ నంబరు ఆధారంగా రోగి ఆరోగ్య సమస్యలను వెంటనే తెలుసుకునే వీలు కలుగుతుంది. ప్రయోజనకరంగా ఉంటుంది. అని భావించినా హెల్త్ కార్డులు అందకుండానే పోయాయి.

మహిళా శక్తి లక్ష్యాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి లక్ష్యాలను పూర్తి చేయాలని డీఆర్‌డీవో శేషాద్రి సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్య భవనంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తిలో భాగంగా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, స్కూల్ యూనిఫాం, మీ సేవ కేంద్రాలు, పెరటి కోళ్ల పెంపకం, మదర్ యూనిట్స్, ఫుడ్ ప్రాసెసింగ్, మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్, మిల్క్ పార్లర్లు వంటివి లబ్ధిదారులకు చేరే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీఆర్‌డీవో గొట్టి శ్రీనివాస్, డీపీఎం, ఏపీఎస్ పాల్గొన్నారు.

టీఎస్‌ఆర్టీసీ సిరిసిల్ల డిపో మేనేజర్‌గా ప్రకాష్

సిరిసిల్ల టౌన్, జూలై 19: టీఎస్‌ఆర్టీసీ సిరిసిల్ల డిపో మేనేజర్‌గా పదోన్నతిపై వచ్చిన ఎ.ప్రకాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు విధులు నిర్వహించిన మనోహర్ కోరుట్ల డిపోకు బదిలీపై వెళ్లారు. హైదరాబాద్ మెహిదీపట్నం డిపోలో ఎంఎఫ్‌గా 12 సంవత్సరాలు విధులను నిర్వహించిన ప్రకాష్ పదోన్నతి పొంది సిరిసిల్ల డిపో మేనేజర్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిపో సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు అభినందనలు తెలిపారు.

ఆక్వా కల్చర్‌పై అధ్యయన యాత్ర



భువనేశ్వర్‌లో ఆక్వా కల్చర్‌ను పరిశీలిస్తున్న బృందం

సిరిసిల్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో సీపా సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వా కల్చర్ విధానంపై అవగాహన కోసం జిల్లాకు చెందిన మత్స్య శాఖ బృందం అధ్యయన యాత్ర చేపట్టింది. శుక్రవారం జిల్లా మత్స్య శాఖ చైర్మన్ చొప్పరి రామచంద్రం ఆధ్వర్యంలో ఆక్వా రైతులు భువనేశ్వర్ ఆక్వా కల్చర్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో మూడు పెద్ద ప్రాజెక్టులు ఉన్నాయని, మత్స్యకారులు చేపలు పెంచుకోవడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుంటారని అన్నారు. బృందంలో వైస్ చైర్మన్ అంబటి శేఖర్, డైరెక్టర్లు పణి శివరామకృష్ణ, గాడిచెర్ల శ్రీనివాస్, జెట్టి దేవయ్య ఉన్నారు.

గోశాలను పరిశీలించిన ఏఎస్పీ



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ కల్చరల్, జూలై 19: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ గోశాలను ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా తిప్పాపూర్ గోశాలలోని కోడెల స్థితిగతులను తెలుసుకున్నారు. కోడెలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కోడెల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దేశంలో ఆదర్శంగా నిలవనున్న తెలంగాణ

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



రుద్రవరంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 19: దేశ చరిత్రలో తెలంగాణ రాష్ట్రం ఒక ఆదర్శంగా నిలనుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ మండలం రుద్రవరం రైతులతో ముచ్చటించారు. రైతు రుణమాఫీ వర్తించిన రైతుల ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్‌లు చూపించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో గుజరాత్ మోడల్ రాష్ట్రం అన్నారని, నేడు తెలంగాణ రాష్ట్రాన్ని మోడల్ అని పిలుస్తున్నారని అన్నారు. రుణమాఫీపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతు రుణమాఫీ చేసి ప్రజల గుండెల్లో నిలిచారని, నేడు ఏకకాలంలో రైతు రుణమాఫీతో సీఎం రేవంత్‌రెడ్డి రైతుల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. రూ. లక్ష రుణం తీసుకున్న రైతులకు జిల్లా పరిధిలో 23 వేల మంది ఉండగా వేములవాడ నియోజకవర్గంలో 11 వేల పైచిలుకు రైతులకు రూ.136 కోట్లు మాఫీ చేసినట్లు చెప్పారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ హామీని నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ నెల చివరి వరకు రూ. 1.50 లక్షల రుణమాఫీ, ఆగస్టులో రూ. 1.50 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ఊరడి రాంరెడ్డి, కత్తి కనుకయ్య, రాజ్‌కుమార్, ఎర్రం ఆగయ్య, పండుగ ప్రదీప్ తదితరులు ఉన్నారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

● రాకపోకలకు హన్మాజీపేట గ్రామస్థుల ఇబ్బందులు



వాగులో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

వేములవాడ రూరల్ జూలై 19: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట వాగులో తాత్కాలికంగా వేసిన రోడ్డు వరద దాటికి కొట్టుకుపోయింది. రోడ్డు కొట్టుకుపోవడంతో వేములవాడతో పాటు ఇతర గ్రామాల రాకపోకలకు హన్మాజీపేట ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సార్.. మమ్మల్ని వదిలి వెళ్లొద్దు

● బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ● అడ్డుకున్న విద్యార్థులు



ఉపాధ్యాయుడి వద్ద రోదిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, జూలై 19: తల్లిదండ్రుల తర్వాత పిల్లలకు మార్గదర్శి గురువు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించే ఆదర్శ మూర్తి. చదువుతోపాటు ఆటా పాటలు నేర్పి విద్యార్థుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటారు. అలాంటి ఉపాధ్యాయులు తమను వీడి వెళ్తున్నారంటే తట్టుకోలేరు. ఇలాంటి సంఘటనే జిల్లాలోని ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం చోటు చేసుకోగా దానికి సంబంధించిన వీడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరలైంది. కిషన్‌దాస్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తొమ్మిదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజిత, అంజలి, మంజుల ఇటీవల ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. విద్యార్థులతో మమేకమైన వారు వేరే బడికి వెళ్తున్న సందర్భంగా గురువారం పాఠశాలకు వచ్చారు. దీంతో 'సార్ మమ్మల్ని వదిలి వెళ్లొద్దు' అంటూ విద్యార్థులు ఏడ్చారు. విద్యార్థుల ప్రేమాభిమానాలు చూసిన ఉపాధ్యాయులు సైతం భావోద్వేగానికి గురై కంటతడిపెట్టుకున్నారు.

ఏఎల్‌వోలకు సన్మానం

సిరిసిల్ల టౌన్, జూలై 19:జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా బాధ్యతలను నిర్వహించి బదిలీపై కరీంనగర్ వెళ్తున్న ఎండీ రఫీ, జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలను స్వీకరించిన నజీర్‌ను శుక్రవారం సిరిసిల్ల లేబర్ ఆఫీస్ కార్యాలయం ఆవరణలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సన్మానించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు : ఎస్పీ



లో లెవెల్ వంతెనను పరిశీలిస్తున్న ఏఎస్పీ

సిరిసిల్ల క్రైం, జూలై 19: భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, పోలీస్ యంత్రంగాన్ని అప్రమత్తం చేశామని తెలిపారు. పోలీసు యంత్రాంగం, డీఆర్‌ఎఫ్ బృందం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి సహాయం పొందాలని వెల్లడించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు మత్స్యకారులు, ప్రజలు చేపల వేటకు వెళ్లవద్దని తెలిపారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్ స్తంభాలను, వైర్లను చేతులతో తాకవద్దని పేర్కొన్నారు. చెట్ల కింద, పాడైన భవనాల కింద ఉండరాదని సూచించారు.

చందుర్తి : భారీ వర్షాల కారణంగా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. చందుర్తి మండలం మల్యాల, జోగాపూర్‌లోని లో లెవెల్ వంతెనలను శుక్రవారం పరిశీలించారు. చెరువులు నిండిన చోట పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి ప్రవాహం ఉన్న లో లెవెల్ వంతెన, రోడ్లలో హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం చందుర్తి పోలీస్ స్టేషన్ పరిశీలించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

మొక్కల ఆవశ్యకతపై భావితరాలకు వివరించాలి



మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

సిరిసిల్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు మొక్కల ఆవశ్యకతను వివరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రెండో బైపాస్ రోడ్డులో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కస్తూర్బా విద్యార్థులతో కలిసి ఎంతో ఉత్సాహంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని రూపకల్పన చేసి తెలంగాణలో హరిత విప్లవానికి నాంది పలికారన్నారు. అడవుల విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు వనాలను పట్టణ వీధుల్లోకి తీసుకొచ్చారన్నారు. 1950లో అప్పటి కేంద్ర మంత్రి కేఎస్ మున్సీ ప్రారంభించిన వనమహోత్సవ కార్యక్రమానికి 75 సంవత్సరాలు నిండాయన్నారు. వనమహోత్సవం గొప్పతనాన్ని అర్థం చేసుకోవాలని, మొక్కలను నాటడంతోపాటు వాటిని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ, అడ్డగట్ల మాధవి, గెంట్యాల శ్రీనివాస్, కల్లూరి రాజు, దిడ్డి మాధవి, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

రైతు దంపతుల రెక్కల కష్టం

● పెట్టుబడి తగ్గించుకునేందుకు సొంతంగా గొర్రు



పొలంలో గొర్రు కొడుతున్న రైతు దంపతులు

ఎల్లారెడ్డిపేట, జూలై 19:గ్రామాల్లో ఒకప్పుడు ఎద్దులతో వ్యవసాయ పనులు చేసేవారు. రానురాను పశు సంపద తగ్గిపోతూ వస్తోంది. యంత్రాలు అందుబాటులోకి వస్తున్నాయి. కొంతమది రైతులు మాత్రం పెట్టుబడి ఖర్చు తగించుకోవాలని సొంతంగా పనులు చేసుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి శివారులో పొలంలో కాస ఎల్లవ్వ- రాజేశం భార్యా భర్తలు శుక్రవారం పొలంలో గొర్రె కొడుతూ కనిపించారు. వారిని పలకరించగా తమకున్న రెండు ఎకరాలతోపాటు మరో ఎకరంన్నర భూమి కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నామని తెలిపారు. సొంతంగా ఎద్దులు లేకపోవడంతో పాటు, యంత్రానికి ఖర్చు పెట్టలేక కాడెద్దులుగా మారి వ్యవసాయ పనులు చేస్తున్నామన్నారు. ఎద్దులు, యంత్రాలతో గొర్రు కొట్టిస్తే ఎకరాకు రోజుకు రూ.3000 తీసుకుంటారని, మూడెకరాలన్నరకు రూ.10,500 చెల్లించ లేక తామేపని చేసుకుంటున్నామని రైతు దంపతులు ఎల్లవ్వ- రాజేశం తెలిపారు.

వస్త్ర పరిశ్రమ సమస్యలపై ఐక్య పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల జూలై 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారం, ఉపాధి కోసం కార్మికులు, ఆసాములు కలిసి ఐక్య పోరాటాలు చేద్దామని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిరిసిల్లలోని భవాని ఫంక్షన్ హాల్‌లో పవర్‌లూం ఆసాముల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం నివారణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెరగాలంటే వస్త్ర పరిశ్రమ మీద ఆధారపడిన వారందరూ ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. వస్త్ర పరిశ్రమలో ప్రధాన సమస్యలైన 10 హెచ్‌పీల వరకు ఉచిత కరెంట్, నాలుగో కేటగిరీ కింద సబ్సిడీ కొనసాగించాలన్నారు. ప్రభుత్వం రూ .10 కోట్ల మీటర్ల ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని, 2023 యారన్ సబ్సిడీని విడుదల చేయాలని అన్నారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. యారన్ డిపో ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం నుంచి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సోమవారం వంటావార్పు, మంగళవారం రాస్తారోకో, బుధవారం సిరిసిల్ల పట్టణ బంద్, గురువారం చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవి మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించడం కోసం కార్మికులు, ఆసాములతోపాటు వస్త్ర పరిశ్రమ మీద ఆధారపడిన 30 వేల కుటుంబాలకు ఉపాధిని కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే 10 మంది కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని, ప్రభుత్వం సమస్య పరిష్కారానికి కృషి చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సంఘాల నాయకులు ఎవరికి వారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారని, ఇకపై కలిసి పోరాటం చేద్దామని అన్నారు. కార్మికులు, ఆసాముల ఐక్య పోరాటాల్లో అందరూ భాగస్వాములుకావాలని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, గోనె పర్శరాములు, చేరాల అశోక్, పోరండ్ల రమేష్, ప్రకాశం, దూస అశోక్, రాజు, సుభాష్, చంద్రకాంత్, కనకయ్య శ్రీను, కనకరాజు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఆసాములు

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, MODUM PRASHANTH, S/O. MODUM SHANKAR, R/O. H.NO. 4-105/2/1, MOGDUMPUR, KARIMNAGAR. HAVE CHANGED MY NAME AS " MODUMPALLI PRASHANTH ", S/O. MODUMPALLI SHANKAR.

AJK-15695

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించిన పాఠకులు బ్యాంక్ అకౌంట్ ద్వారా / ఇతర లావాదేవీలు / క్రెడిట్, ఉద్యోగ మరియు ఇతర ప్రకటనలు జరిపితే ఆంధ్రజ్యోతి సంస్థ బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 99854 10640

జగిత్యాల :- సెల్ : 99854 11262

మెట్‌పల్లి :- సెల్ : 7013142966

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238

పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

సైదాపూర్, జూలై 19: సైదాపూర్ మండలంలోని ఎలబోతారం గ్రామానికి చెందిన మొలుగు లచ్చమ్మ(70) అనే వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం,, ఎలబోతారం గ్రామానికి చెందిన లచ్చమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు లచ్చమ్మను చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతు లచ్చమ్మ మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. దీనిపై ఎస్సై జన్ను ఆరోగ్యంను వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఎగువ నుంచి ఎస్సారెస్పీకి పెరిగిన వరద


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు పెరుగుతోంది. శుక్రవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాం తాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 17,283 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 16.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 26.112 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 475 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 10.584 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.979 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా మహేశ్

చొప్పదండి, జూలై19: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది, చైర్మెన్‌గా కొత్తూరి మహేశ్, వైస్ చైర్మెన్ మునిగాల రాజేందర్, సభ్యులుగా చుప్ప శ్రీనివాస్, పెరుమాండ్ల రవీందర్, ఈర్ల స్వామి, జక్కుల అనిల్ కుమార్, గోస్కుల కొమురెల్లి, పత్తిపాక నరేశ్, వెల్లాల ఆదిరెడ్డి, జాతరకొండ ఓదయ్య, చిలుక సంజీవ్, కొత్తపల్లి నవీన్, యంసాని శంబయ్య, పట్వారి కిషన్‌ను ప్రకటించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయికల్, జూలై 19: మండలంలోని ధర్మాజీపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం రాయికల్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరొకరుపారిపోయినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.8100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. గ్రామాల్లో పేకాట ఆడితే సమాచారం ఇవ్వాలని సూచించారు.

నరసింహుడి ఆలయంలో భక్తుడిపై దాడి

ధర్మపురి, జూలై 19: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఒక భక్తుడిపై ఆలయ ఉద్యోగి, కొందరు కలిసి శుక్రవారం దాడికి పాల్పడ్డాడు. ఆలయ నిత్యాన్నదాన సత్రంలో ఒక భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నాడు. బియ్యం దొడ్డుగా ఉన్నట్లు ఉద్యోగులతో పాటు వంట తయారీ చేసిన వ్యక్తిని అడిగినట్లు సమాచారం. అయితే తమకు ఏమి తెలియదని ఈవో ఆఫీస్‌లో ఫిర్యాదు చేయమని భక్తుడికి తెలియసేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగి అన్నదానం ప్రదేశానికి రావడం వల్ల భక్తుడు దొడ్డు బియ్యం గురించి అతనికి వివరించారు. అనంతరం ఉద్యోగి పేరు, హోదా గురించి ప్రశ్నించాడు. వెంటనే ఆ ఉద్యోగి ఆఫీస్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని చెప్పి వెళ్లినట్లు సమాచారం. భక్తుడు ఈవో కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయగా ఆ ఉద్యోగికి భక్తుడికి తీవ్ర వాదోపవాదాలు జరిగినట్లు తెలిసింది. భక్తుడి కుటుంబ సభ్యులతో కలిసి ఆఫీస్ నుండి కింది రాగా ఆలయ ఆవరణలో కుటుంబ సభ్యుల సమక్షంలో భక్తుడిని ఉద్యోగి సహా మరి కొందరు కొట్టినట్లు తెలిసింది. ఈ విషయమై ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నం చేయగా అందుబాటులో లేరు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- గ్రామాభివృద్ధి పేరుతో వేలం పాటలు
- పట్టించుకోని అధికారులు


ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

మల్లాపూర్, జూలై 19: మల్లాపూర్ మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. అనుమతులు లేకుండా ఇష్టారీతిన ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేయడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు ఇసుక రవాణాను అడ్డుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల అభివృద్ధి పేరిట వీడీసీలు గ్రామంలో కూల్ డ్రింక్, పెట్రోల్, డీజిల్, చికెన్ విక్రయాలు చేయడానికి, ఇసుక, మట్టిని తరలించడానికి వ్యాపారం చేసుకోవడానికి వేలం పాటలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో అక్రమ వ్యాపారస్థులు రెచ్చిపోతున్నారు. గోదావరి పరివాహక గ్రామాల్లో దొరికే ఇసుక అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. ఇక్కడి నుంచి పట్టణ ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను వ్యాపారులు అక్రమంగా తరలించడమే దందాగా మార్చుకొని సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక అధికారులు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ఇసుక రవాణాకు ఎలాంటి అడ్డూ అదుపు లేకుండా సాగుతోందని స్థానికుల చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక మాఫీయా ఆగడాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మికుంట, జూలై 19: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తండా ఉండాలని జమ్మికుంట టౌన్ సీఐ రవి అన్నారు. మండలంలోని శాయంపేట గ్రామంలో గ్రామస్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దన్నారు. అలాగే యువత చెడు మార్గంలో వెళ్లకుండా ఉండాలన్నారు. డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత లక్ష్యం కోసం క్రమశిక్షణతో చదవాలని సూచించారు. చదువుతోనే జీవితంలో ఉన్నత స్థానం దక్కుతుందని చెప్పారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



శాయంపేటలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవి

ఈనెల 26న బ్రహ్మాండమైన విడుదల



GLOBAL CINEMAS RELEASE

SUPER HIT నేడే చూడండి



లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్ 11.30am
సినీ ప్లానెట్ - కొంపల్లి 4.50pm
ఎంజిబి సినీప్లెక్స్ - నారపల్లి 10.25am
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ 2.05pm
జిపిఎస్‌ఎమ్ - మహేశ్వరం 12.00pm
విశ్వనాథ్ సత్య - కూకట్‌పల్లి 2.40pm
అశోక మాల్ - కూకట్‌పల్లి జంక్షన్ 1.40pm

NTR CINEMAS 9030161717

IT'S A MESSAGE ORIENTED MOVIE నేడే చూడండి



శాంతి 70ఎంఎం - నారాయణగూడ
11.00,2.00,6.00,9.00
మెగా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
వెంకటసాయి 70 - కీసర 11.00,2.00,6.00,9.00
వెంకటేశ్వర 70 - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00

SAI VUSUVAL HOUSE 9849153511/7013388396

YOUTHFUL SUSPENSE THRILLER నేడే చూడండి



సప్తగిరి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

SRI VIJAYA FILMS

UNANIMOUS EPIC BLOCKBUSTER
విజయవంతమైన 4వ వారం
తగ్గించబడిన టికెట్ రేట్స్
మల్టీప్లెక్స్: 295/-, 350/-, సింగిల్ స్క్రీన్: 175/-,110/-, 50/-



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

తెలుగు 2D

GLOBAL CINEMAS RELEASE

FAMILY ENTERTAINMENT విజయవంతమైన 5వ వారం



శ్రీకృష్ణ 70ఎంఎం - ఆలియాబాద్ 11.00,2.00,6.00,9.00

PARAM JYOTHI FILMS 9848028739

విజయవంతమైన 2వ వారం



సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.45
టికెట్ ధర: 175/-, 110/-, 55/-
అర్జున్ 70ఎంఎం - కుకట్‌పల్లి 11.00,2.30,6.00,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.30,6.00,9.30

GLOBAL CINEMAS RELEASE

MAD MAX FAMILY ENTERTAINER నేడే చూడండి



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
రాజధాని ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.25,6.15,9.15
జగదాంబ ఎ/సి - ఘట్‌కేసర్ 11.30,2.30,6.30,9.30
మల్లికార్జున 70 ఎ/సి - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30
వెంకటరమణపద్మావతి 70 - కాచిగూడ 2.40,9.30
శ్రీరాములు 70 ఎ/సి - మూసాపేట్ 11.30,2.30,6.30,9.30

MYTHRI MOVIE DISTRIBUTORS LLP

పేదలకు సంక్షేమ పథకాలు అందజేయాలి

» ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 19: అర్హులైన పేదలకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందేలా, పథకాలు అమలయ్యేలా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్, జిల్లా ఎస్పీలు, ఇతర అధికారులు పారదర్శకంగా పనిచేయాలని రాష్ట్ర సాగునీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా రైతు భరోసా అమలుపై మంత్రివర్గ ఉపసంఘం రైతుల నుంచి అభిప్రాయాల సేకరణకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కరీంనగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కొంతసేపు విశ్రాంతి తీసుకుని ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సుడా చైర్మన్, జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ప్రత్యేకంగా కలెక్టర్లు, సీపీ, ఎస్పీల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పనితీరును మంత్రులు ప్రశంసించారు. 60 శాతం పైగా భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులే వస్తున్నా యని సీపీ అభిషేక్ మొహంతి మంత్రుల దృష్టికి తీసుకురాగా బాధితు లకు న్యాయం అందించేలా పారదర్శక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇదే విధంగా ముందుకుసాగాలన్నారు. న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు.

● ఎమ్మెల్యేలతో కూడా మంత్రులు కొద్దిసేపు మాట్లాడి నియో జకవ ర్గాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నియోజకవర్గాల పరిధిలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, స్థానికంగా నెలకొన్న సమస్యలను మంత్రులు దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నిటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ శివారు ప్రాంతాల్లో భూకబ్జాలు అధికమయ్యాయని, పేదలు, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లా కలెక్టర్లు, కరీంనగర్ పోలీస్‌కమిషనర్, జగిత్యాల, సిరిసిల్ల ఎస్పీలు, అడిషనల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

● కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని పౌరసరఫరాలశాఖ అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు ఉమ్మడి జిల్లాలో ఆయా శాఖల పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నవోదయ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, జూలై 19: నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతూ ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా ఉమ్మడి జిల్లాలో నివసిస్తూ ఉండాలని ఆమె తెలిపారు. సెప్టెంబరు 16లోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డిపో మేనేజర్లు బాధ్యతల స్వీకరణ



ఈడీ వినోద్‌కుమార్‌కు పూలమొక్కను అందజేస్తున్న డిపో మేనేజర్లు

భగత్‌నగర్, జూలై 19: నూతనంగా నియమితులైన మంథని, వేములవాడ, సిరిసిల్ల డిపో మేనేజర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పదోన్నతిపై మంథని, వేములవాడ, సిరిసిల్ల డిపోలకు మేనేజర్లుగా నియమితులైన వీఎస్ కుమార్, బి శ్రీనివాస్, ఎ ప్రకాశ్‌రావు బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం, హెడ్ ఆఫీస్, మెహదీపట్నంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్)గా పనిచేస్తున్న వారు డిపో మేనేజర్లుగా పదోన్నతి పొందారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి వినోద్‌కుమార్, రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత, డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె సత్యనారాయణ, డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్రయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

తెలంగాణకు అన్యాయం

» రాష్ట్ర విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలి

» సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 19: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలు అమలు కాకపోవడంతో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలు అమలు అంశాలను ప్రవేశపెట్టాలని చెప్పారు. పునర్విభజన చట్టంలోని హామీల అమలుపై తెలంగాణకు చెందిన కేంద్రమంత్రులు స్పందించాల న్నారు. చట్టంలోని అంశాలు అమలు కాక తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్సిటీ, వెనుకబడిన జిల్లాల అభివృ ద్ధికి ప్రత్యేక నిధులు, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని విభజన హామీల్లో ఉన్నప్పటికీ అమలు చేయలే ద న్నారు. ఆంధ్రప్రదేశ్ లో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చా రని, తెలంగాణ ప్రాజెక్టుకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం లో ముఖ్యమంత్రిగా కేసీఆర్ అనేక తప్పులు చేశారని ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును విస్మరించారని చెప్పారు. ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ ప్రాణ హిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు దశల వారీగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రానికి సంబంధించి సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిలిపి వేయాలన్నారు. వేలం వేసే అంశంపై తీవ్రంగా చర్చ జరుగుతుందని, వేలం వేస్తే ప్రైవేటీకరణ చేసినట్లే అవుతుం దని, సింగరేణిని ప్రైవేటీకరణ చేయనని చెప్పిన మోదీ పచ్చి అబద్ధాల కోరనే విషయం అర్థమయిం దన్నారు. 27వ తేదీన గ్లోబల్ టెండర్లు పిలుస్తున్నందున తక్షణమే టెండర్‌లు రద్దుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ప్రక్రియను ప్రారంభించిం దన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించకుండా రుణమాఫీ చేయాలని, బ్యాంకుల్లో సమస్యలు తలెత్తకుండా పూర్తిగా రుణమాఫీ చేయాలన్నారు. రైతు భరోసా ఇప్పటి వరకు ఇవ్వలేదని తక్షణమే చెల్లించాలన్నారు. ఎకరానికి 7,500 ఇస్తామని హామీ ఇచ్చారని సంవత్సరానికి 15 వేలు ఇవ్వాలని, ధాన్యానికి 500 బోనస్ ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని చెప్పిందని అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరుచేయాలన్నారు. ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. రేషన్ కార్డులు లేక పదేళ్ల పాటుప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధిహామీ కూలీలకు వారానికి ఒకసారి కూలీ డబ్బులు చెల్లించాలని సూచిం చారు. సీఎం రేవంత్‌రెడ్డి పారదర్శకపాలన అందించాల న్నారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుపై సీపీఐ నాయకత్వం, ప్రజా సంఘాలు కిం ది స్థాయి వరకు పరిశీలించి ప్రజలకు అందే విధంగా చూస్తామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలుపెట్టుకున్నారని వాటన్నిం టిని అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. సమావేశంలో నాయకులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, గూడెం లక్ష్మి, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, కిన్నెర మల్లవ్వ, నలువాల సదానందం, బామండ్లపల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, నల్లగొండ శ్రీనివాస్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట జూలై 19: కోనరావుపేట మండలం మర్తన్‌పేట గ్రామానికి చెందిన జవ్వాజి శేఖర్ అనే గీత కార్మికుడు తాడిచెట్టు పైనుంచి పడగా గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం కల్లు తీయడానికి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తుకింద పడిపోయాడు. గాయాలైన శేఖర్‌ను తోటి కార్మికులు వెంటనే సిరిసిల్ల ఆస్పత్రికి తరలిం చారు.

41 మంది మందుబాబులకు జరిమానా

తంగళ్లపల్లి, జూలై 19: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారితోపాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 41 మందికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఉదయశ్రీ జరిమానా విధించినట్లు తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్ తెలిపారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. తంగళ్లపల్లి మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందిని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి 18 మందిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.2 వేలు, తొమ్మిది మందికి రూ. 1,500, 11 మందికి రూ.1000, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 18 మందికి రూ.210 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గొల్లపల్లిలో వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిపేట, జూలై 19: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని 25 మంది వాహనదారులకు జరిమానా విధించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. వాహన పత్రాలు లేకుండా నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కొండచిలువ కలకలం



పొలంలో కనిపించిన కొండచిలువ

గంభీరావుపేట, జూలై 19: గంభీరావుపేట సమీపాన ఓ రైతు పొలంలో కొండచిలువ కనిపించడం కలకలం రేగింది. మల్యాల రాజవీర్‌కు చెందిన పొలంలో శుక్రవారం కొండచిలువను రైతు గమనించారు. వ్యవసాయ పనుల్లో ఉన్న ఆ రైతు కొండ చిలువ చూసి భయంతో వణకిపోయాడు. అతడు కేకలు వేయడంతో సమీప పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి చేరుకునే సరికి కొండచిలువ వెళ్లిపోయింది. దీంతో సమీప ప్రాంతాల్లో పొలాలు ఉన్న రైతులు భయాందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రుద్రంగి, జూలై 19: రుద్రంగి మండల కేంద్రం శివారులోని గంగమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగిలోని గంగమ్మ గుడి వద్ద ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న బైక్ బస్సును ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న పండుల శ్రీనివాస్‌కు స్వల్పగాయాలయ్యాయి. శ్రీనివాస్ భార్య మాధవికి తీవ్రగాయాలయ్యాయి. శ్రీనివాస్, మాధవిని వేములవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై అశోక్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎస్‌యూ ఎం ఫార్మసీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూలై 19: శాతవాహన విద్యాలయంలో మే 2024లో నిర్వహించిన ఎం ఫార్మసీ ఒకటో, మూడో సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌యూ.ఏసీ.ఇన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బైకును ఢీ కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు

బీర్‌పూర్, జూలై 19: ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులను అజాగ్రత్తతో ట్రాక్టర్ నడిపి వాహనాన్ని ఢీ కొట్టిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమో దు చేసినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురువారం దొంతాపూర్ గ్రామానికి చెందిన సర్దా లక్ష్మన్ అతడి భార్య జమున తమ ద్విచక్ర వాహనంపై దొంతాపూర్ నుంచి జగిత్యాలకు వెలుతున్నారు. నర్సింహులపల్లి గ్రామ శివారులో సూరపాక తిరుపతి బీర్‌పూర్ గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ నడుపుతూ వారి మోటర్‌సైకిల్‌ను ఢీ కొట్టాడు. దీంతో పై ఇద్దరికి గాయాలయ్యాయి. వరుసకు కొడుకైన సర్దా సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శాకాంబరీ అవతారంలో వాసవీమాత



కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల, జూలై 19: పట్టణంలోని వాసవీ దేవాలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారు శాకాంబరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేదపండితుడు పాలెపు రాంశర్మ మంత్రోచ్ఛారణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. వివిధ కూరగాయలతో అమ్మవారికి అలకరించి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక కంకుమపూజ కార్యక్రమాన్ని నిర్వహించచారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. విష్ణు, లలిత సహస్ర నామ పారాయణం జరిపి గోరింటాకు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు రాజేంద్రప్రసాద్, సంతోష్, శ్రీకాంత్ పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ధర్మారం, జూలై 19: ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలో తండ్రి మందలించాడని పురుగుల మందు తాగి ఆత్మాహత్యా యత్నం చేసిన నేరేళ్ల మహేష్ (26) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు.. ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేరేళ్ల భూమయ్య కొడుకైన మహేష్ ఇటీవల తనకు సెల్ ఫోన్, బైక్ కొనివ్వాలని, లేదంటే తను చనిపోతానని తండ్రిని బెదిరించాడు. దీంతో తండ్రి సెల్‌ఫోన్, బైక్ కొనిచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 17న తొలి ఏకాదశి సందర్భంగా పండగపూట తండ్రి కొడుకును ఊరికే బైక్ మీద తిరగకు, రోజులు బాగా లేవని మందలించాడు. మనస్తాపానికి గురైన మహేష్ ఇంటి వెనకాల పురుగుల మందు తాగి పడిపోయాడు.. గమనించిన కుటుంబ సభ్యులు వైద్య చికిత్సల నిమిత్తం హుటాహుటిన కరీంనగర్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహేష్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన వృద్ధుడు..

సుల్తానాబాద్, జూలై 19: సుల్తానాబాద్ మండలంలోని రేగడి మద్దికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన సుద్దాల కొమురయ్య అలియాస్ చిక్కుడు కొమురయ్య (63) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొమురయ్య తన ఇంట్లో గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని మల్లయ్య పల్లి గ్రామానికి శుక్రవారం సాయంత్రం తీసుకువచ్చారు. కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు గుంటల భూమి కోసం మరదలిని హత్యచేసిన బావ

- నాలుగు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు

గంగాధర, జూలై 19: ఆరుగుంటల భూమి పంచి ఇవ్వడంలేదని కక్ష పెంచుకుని సొంత భార్య చెల్లిని హత్య చేసిన నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గర్షకుర్తికి చెందిన చిందం మాధవి ఈనెల 15న అనుమానాస్పదంగా మృతి చెందిందని ఆమె మేన మామ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మాధవి కొన్ని రోజులుగా తమ మాటవినకుండా యువకుడితో సన్నిహితంగా ఉంటుందని, తమకు రావాల్సిన గర్షకుర్తిలోని 6 గుంటల భూమి పంచి ఇవ్వడంలేదని బావ గుండ అంజనేయులు, అక్క గుండ మానసలు కక్ష పెంచుకున్నారు. ఈక్రమంలో ఏలాగైనా మాధవి అడ్డుతొలగించుకుని భూమిని కాజేయాలని అంజనేయులు ఈనెల 14 గర్షకుర్తికి వచ్చాడు. ఇంటిలో మాధవి ఒంటరిగా ఉండగా భూమి విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రేకుడైన అంజనేయులు తన మాట వినడంలేదని చున్నీతో మాధవి మెడకు బిగించి చంపివేశాడు. అనంతరం ఎవ్వరికి అనుమానం రాకుండా ఇంట్లోని ఫ్యానుకు ఉరి వేరివేసుకున్నట్లు వేలాడదీశాడు. అనుమానం రాకుండా స్వగ్రామం తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌కు వెళ్లి తన భార్య మానసకు విషయం చెప్పాడు. అయితే అనుమానాస్పదకేసు నమోదు చేసిన ఎస్ఐ కిరణ్‌రెడ్డి వివిధ కోణాల్లో విచారించారు. అంజనేయులు, మానసలు నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐ కిరణ్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

గంజాయికి అలవాటుపడి..పెడ్లర్‌గా మారి..

● గంజాయి సరఫరా చేస్తున్న బీటెక్ విద్యార్థి

● మరో ఐదుగురితో కలిసి గంజాయి సేవిస్తుండగా పట్టుబడిన వైనం

● 150 గ్రాముల గంజాయి స్వాధీనం..కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, జూలై 19: గంజాయికి అలవాటుపడిన ఓ బీటెక్ విద్యార్థి డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో గంజాయి సేవిస్తుండగా అతడితో పాటు మరో ఐదు గురు విద్యార్థులను పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇబ్రహీంపట్నం టౌన్‌లో ఓ ప్రైవేటు హాస్టల్‌పై నార్కోటిక్ బృందం, ఇబ్రహీంపట్నం పోలీసులు గురువారం రాత్రి సం యుక్తంగా దాడులు చేసి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరాదారుడితో కలిపి ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఇందులో గంజాయి సరఫరాదారుడు పరారీలో ఉన్నారు. సీఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ టౌన్‌కు చెందిన శ్రీరాముల సాత్విక్ (21) ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ.. ఇక్కడ ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా, అతనికి సిరిసిల్ల సమీపంలోని ఇల్లంతకుంటకు చెందిన నవీన్(25)తో పరిచయం ఏర్పడింది. నవీన్ భద్రాచలం ఏజెన్సీ ఏరియా నుంచి గంజాయిని తీసుకొచ్చి సాత్విక్‌కు సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో గంజాయికి అలవాటుపడిన సాత్విక్ పెడ్లర్‌గా మారి ఇబ్రహీంపట్నం పరిసరాల్లో చదువుతున్న విద్యార్థులకు గంజాయి పాకెట్లను విక్రయిస్తున్నాడు. ఇదే క్రమంలో తాను చదువుతున్న కళాశాలలోనే బీటెక్ విద్యార్థులు నూకల సంపత్‌నాయుడు (20), ఓ మైనర్, స్వయంపాకుల కార్తీక్ (20)లతోపాటు నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఓ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తున్న పడాల వంశీ(20), దంపేట గణేష్ (21)లతో పరిచయం పెంచుకున్నాడు. నవీన్ మిన హా పై ఆరుగురు ఇబ్రహీంపట్నంలోని ఓ హాస్టల్‌లో గంజాయి సేవిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు.. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో నార్కోటిక్ బృందం, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. కాగా, సాత్విక్‌పై ఇదే విషయంలో మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కూడా గతంలో ఓ కేసు నమోదైంది. నవీన్‌పై మీర్‌పేట్‌లో ఓ కేసు, సిరిసిల్లలో మూడు కేసులున్నాయి. ఈ మేరకు వీరిపై కేసులు నమోదు చేశామని, గంజాయి అమ్మకందారైన సాత్విక్‌ను రిమాండ్‌కు పంపినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మరో నిందితుడు నవీన్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

అటవీశాఖలో అధికారుల బదిలీలు

సిరిసిల్ల క్రైం , జూలై 19: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలువరు అటవీశాఖ అధికారులు శుక్రవారం బదిలీ అయ్యారు. 3 సంవత్సరాల కంటే ఎక్కువ ఒకే చోట పనిచేసిన సెక్షన్ అధికారులు, బీట్ అధికారులకు బదిలీ తప్పలేదు. సిరిసిల్ల సెక్ష న్ అధికారి భూలక్ష్మీ సిరిసిల్ల స్ట్రైకింగ్ ఫోర్స్ సెక్షన్ అధికారిగా, గంగాధర డిప్యూటీ రేంజ్ అధికారిగా బాపిరాజు, వెంకటాపూర్ డిప్యూటీ రేంజ్ అధికారిగా మోహన్ లాల్ , శ్రవణ్‌కుమార్‌కు సిరిసిల్ల సెక్షన్ అధికారిగా, బీట్ అధికారులుగా వి సతీష్ (అల్మాస్‌పూర్), లావణ్య (గర్జనపల్లి), వసుమతి (పెద్ద లింగాపూర్)కు బదిలీ అయ్యారు. వీరందరూ జీవో నెంబర్ 18 ప్రకారం ఈ నెల 21న రిలీవ్ కావాల్సి ఉంది.

పోస్టర్ల ఆవిష్కరణ

సుభాష్‌నగర్, జూలై 19: నాస్తిక సమాజం మూడో మహాసభల పోస్టర్లను శుక్రవారం భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు ఉప్పలేటి నరేష్ కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుకొండలోని వడ్డేపల్లి పీఆర్‌రెడ్డి భవన్‌లో ఈనెల 24న మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో కుల, మత, మూఢనమ్మకాల నిర్మూలన కోసం కృషి చేస్తున్న నాస్తిక సమాజం 52 సంవత్సరాలుగా ప్రజలకు ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు జాతీయ స్థాయిలో అనేక రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం హనుమకొండలో నిర్వహిస్తున్నామని నాస్తికులు సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

హుజూరాబాద్, జూలై 19: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని శుక్రవారం కాయకల్ప అవార్డు బృందం సభ్యులు డాక్టర్ హరిప్రియ, క్వాలిటీ మేనేజర్ సురేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో సుధాకర్‌రావు, ఏవో నారాయణరెడ్డిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా ఆస్పత్రిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం ఉన్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్

సుభాష్‌నగర్, జూలై 19: చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ఈ నెల 30,31 తేదీల్లో తలపెట్టిన చలో ఢిల్లీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 1 నుంచి 10 వరకు కొడంగల్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని, అంబేడ్కర్ అభయహస్తం కింద రూ. 12లక్షలు ప్రతి మాదిగ కుటుంబానికి ప్రభుత్వం ఇవ్వాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మాదిగ సంఘాల ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కెటాయించాలని, వికలాంగులకు రూ. 7వేల ఫించన్ ఇవ్వాలని, సదా లక్ష్మమ్మ విగ్రహాన్ని టాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, డప్పు కొట్టే మాదిగలకు రూ. 5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య, కార్యదర్శి మాచారం మాసయ్య, ఉమ్మడి జిల్లా ఇంచార్జీ కనకం రవి, జిల్లా అధ్యక్షుడు రమాగిరి సారయ్య, బొడ్డు లక్ష్మన్, నంటి గణేశ్, ఖమ్మం కృష్ణ, మాట్ల రాజ్‌కుమార్, మాతంగి కుమారస్వామి, నందేల దేవయ్య, సుంకపాక దేవరాజు, దాల్లపల్లి లక్ష్మన్, అరికిల్ల గణపతి, ఖమ్మం కుమారస్వామి, ఎన్నగందుల శ్రీకాంత్, కనకం రాజు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా అధ్యక్షుడిగా మాట్ల రాజ్‌కుమార్

టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మాట్ల రాజ్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోల్ల బాలరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికి రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని పరిష్కరించాలి

- వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్



మాట్లాడుతున్న వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్

సిరిసిల్ల రూరల్, జూలై 19: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని మాట్లాడుతున్న వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు దామోదర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో శుక్రవారం జేఏసీ నాయకుల సమావేశం సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలల్లో నెలకొన్న విద్యుత్ ఇతర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలంటూ ఈ నెల 22 నుంచి సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రిలేనిరహారదీక్షలను చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. దీక్షలను కొనసాగిస్తూనే 22న సోమవారం వంటావార్పు కార్యక్రమంతో ప్రారంభించి 23న రాస్తారోకో, 24న పట్టణ బంద్‌కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే 25న చలో హైదారాబాద్ కార్యక్రమాన్ని చేపట్టి అసెంబ్లీని ముట్టడించేందుకు రూపకల్పన చేశామని వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అడెపు భాస్కర్, అసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ఏఐటీయూసీ లాల్‌బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం కార్యదర్శి పంతం రవి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభంతోపాటు సమస్యలను పరిష్కారించాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు వివిధ రూపాల్లో తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేక పోవడంతో జేఏసీ అధ్వర్యంలో ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాలను కార్మికులు, అసాముల విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, అసాముల సంఘం నాయకులు గోనేపర్శరాముల, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి అంకాలపు రవి, పోలు శంకర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, కోడం అశోక్, పిస్క మధు, ఏనుగుల ఎల్లయ్య, గోవిందు రవి, దూడం శంకర్, గాజుల నారాయణ, దూసభూమయ్య, మండల సత్యం, వెల్దండి దేవదాస్, మోర రాజు, కళ్యాడపు సుభాష్, బోద్దుల సుదర్శన్, బండారి అశోక్, బూట్ల నవీన్, బూర కనుకరాజు, దూడం రమేష్, గంగుల శ్రీనివాస్, కోడం శ్రీనివాస్, మండల బాలరాజు, శ్రీరాం సత్యం, హనుమండ్ల రామనారాయణ, బొడ్డు శ్రీధర్, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఊరూరా కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

సిరిసిల్ల టౌన్, జూలై 19: రైతు రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఊరూరా సంబరాలు నిర్వహించాయి. సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద సిరిసిల్ల కాంగ్రెస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలోని అన్నదాతలు అప్పుల పాలు కాకుండా ఆదుకోవడం కోసం రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ మాట ఇచ్చిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మొదటి విడతగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష రూపాయాలలోపు ఉన్న రైతుల పంట రుణాలను మాఫీ చేశారన్నారు. రెండో విడతగా ఈ నెల ఆఖరులో రూ.లక్ష 50వేల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ, ఆగస్టు 15లోపు రెండు లక్షలలోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, కౌన్సిలర్ రవికుమార్, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, సిరిసిల్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రవీందర్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, జగన్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : రైతు రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ మండలకేంద్రంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మామిడి నరేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను మభ్యపెట్టిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే సారి రూ.2లక్షల వరకు రైతు రుణాలు మాఫీ చేయాలని నిర్ణయించిందన్నారు. తొలి విడత లక్ష మాఫీ చేసిందన్నారు. నాయకులు బాలపోచయ్య, గొడుగు నర్సయ్య, మామిడి రాజు, తారెడ్డి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, కాసుపాక శంకర్, ఉస్మాన్, మామిడి తిరుపతి, పర్స అయిలయ్య, శ్రీనివాస్, వెంకన్న, రాజెల్లయ్య, రాంరెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, రాజన్నపేట, తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, రైతులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, బుచ్చాగౌడ్, బాబు, రాములు, రాజేందర్, శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, రాజునాయక్, శ్రీనివాస్, రఫీక్, రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, రాజయ్య, రాజేశం, బాల్‌రెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలకేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతగా రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొంగు తిరుపతియాదవ్, నాయకులు హరిలాల్, లెంకెల లక్ష్మణ్, జోగుల కాంతయ్య, రాకేష్, నాగరాజు, రాజు నాయక్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : రైతుల మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ చేపట్టాయి. పద్మనగర్, బద్దనపల్లి, సారంపల్లి, నేరెళ్ల, జిల్లెల్ల వరకు కొనసాగింది. అనంతరం జిల్లెల్ల క్రాసింగ్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గోపాల్‌రావ్‌పల్లెకు చెందిన నాయకుడు మీరాల శ్రీనివాస్ యాదవ్‌తోపాటు రైతులు చీర్లవంచ శివారులోని ముత్యాల పోచమ్మకు బోనం సమర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, నాయకులు లింగాల భూపతి, మోర రాజు, నేరెళ్ల నర్సింగంగౌడ్, భైరినేని రాము, మోర లక్ష్మిరాజం, మందాడి తిరుపతి, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, మునిగెల రాజు, జూపెల్లి రాజేశ్వర్‌రావు, చుక్క శేఖర్, గడ్డం మధుకర్, గుగ్గిళ్ల శ్రీకాంత్, ఎగుర్ల ప్రశాంత్, చేన్నమనేని ప్రశాంత్, రెడ్డి పర్శరాములు, ముక్క వాసు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, జిల్లా కార్యదర్శి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీలు నాగభూషనం, పర్శరాములు, నాయకులు రాజనర్సింహరెడ్డి, ప్రబాకర్, అక్కపల్లి బాలయ్య ఉన్నారు.

ముస్తాబాద్ : మండలంలోని గూడెంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సడిమెల బాలయ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు, గ్రామస్థులు లింగంపెల్లి ఎల్లాగౌడ్, ఓదేల, శ్రీను, బొప్ప విష్ణు, శంకరయ్య, తిరుపతి, శ్రావణ్‌రావు, రాజన్న, గిరిరావు పాల్గొన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాలుక సత్యం, పల్లె మంజులరవీందర్ రెడ్డి, మంతెన రవి, శంకర్, శ్రీనివాస్, రాజేశం, నరసింహారెడ్డి, మాధవరెడ్డి, మల్లయ్య, శ్రీకాంత్, శేఖర్, ఆదిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గంగయ్య గౌడ్, రాములు పాల్గొన్నారు.

రుద్రంగి : రుద్రంగి మండలం మానాలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, రైతులు ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మూత్యాల సునిల్ కూమార్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలపతి, మోహన్, దీలీప్, లక్ష్మీనారాయణ, రాజు, శంకర్ పాల్గొన్నారు.


సిరిసిల్లలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


తంగళ్లపల్లిలో..


గంభీరావుపేటలో..


రుద్రంగి మండలం మానాలలో..


ముస్తాబాద్ మండలం గూడెంలో..

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోనరావుపేట జులై 19: కోనరావుపేట మండలం మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 1996-97 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఘనంగా పోచమ్మ బోనాలు

వేములవాడ కల్చరల్, జూలై 19 : వేములవాడ పట్టణంలో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఉజ్వల హై స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు బద్ది పోచమ్మకు బోనాలను తీశారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులను ధరించి నెత్తిన బోనాలతో ఆలయానిక ఊరేగింపుగా రాగా విద్యార్థులు పోతరాజు వేశాధరణతో ఆకట్టుకున్నారు. కాగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ బోనాలకు హజరై అమ్మవారిని విద్యార్థులతో ముచ్చటించారు. కరస్పండెంట్ అరుణాద్రి తదితరులు ఉన్నారు.

రుణమాఫీ ప్రచారానికే పరిమితం

బోయినపల్లి, జూలై 19: రుణమాఫీ ప్రచారానికే తప్ప రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గురువారం రైతులకు లక్ష రుణమాఫీ చేశామంటూ కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారని, రాష్ట్రంలో 30 శాతం మంది రైతులకు కూడా బ్యాంకుల్లో నగదు జమ కాలేదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతులకు ఇచ్చిన రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన మిగతా వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

హరీశ్‌రావును విమర్శించే హక్కు లేదు

● రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి


భూషణరావుపేటలో మాట్లాడుతున్న బాపురెడ్డి

కథలాపూర్, జూలై 19 : మాజీ మంత్రి హరీశ్‌రావును రాజీనామా చేయాలనే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని భూషణరావుపేటలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలకు అసెం బ్లీలో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన రాహుల్‌గాంధీ మాటలు బుట్టదాఖ లయ్యాయని ఆరోపించారు. హరీశ్‌రావు చాలెంజ్‌కు ముందుకు రాకుండా కేవ లం లక్ష రూపాయల రుణమాఫీ మాత్రమే చేసి చేతులు దులుపుకున్నార న్నా రు. బీఆర్ఎస్ సర్కారు లక్ష రూపాయల రుణమాఫీకి రు. 19,109 కోట్లు మం జూరు చేస్తే కాంగ్రెస్ కోతలు పెట్టి కేవలం ఆరు వేల కోట్లు మాత్రమే విడు దల చేసిందని విమర్శించారు. కొడంగల్‌లో 2018లో ఓడిపోతే రాజకీయ స న్యాసం తీసుకుంటానని ప్రకటించిన రేవంత్‌రెడ్డి మాట తప్పారని చెప్పారు. వరికి రు. 500 బోనస్ ఇస్తామని రైతులను నమ్మించి మోసగించారని పేర్కొ న్నారు. ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేసి చూపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య, బద్దం మహేందర్, పురుకుటపు గం గారెడ్డి, గడ్డం శేఖర్, వినోద్‌రావు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

చందుర్తి జులై 19: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని మాల మహానాడు సంఘం మండల అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలంలో ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను, మూడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 9.3 జీపీఏ సాధించడంతోపాటు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థి ఇల్లంతకుంట మణిచంద్రను మండల మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో మూడపల్లిలో శుక్రవారం సన్మానించారు. ఉపాధ్యాయులు గుమ్మడి కవిత, అల్లం లింగయ్య, మెడికాల అంజయ్య, బండ నర్సయ్య, కురుకుంట్ల లక్ష్మణ్, పెరుమాండ్ల హన్మండ్లు, మండల మాల మ హనాడు ఉపాధ్యక్షులు అసినిపర్తి ఏసు కుమార్, కార్యదర్శి గంధం ప్రదీప్, దేవస్వామి, సంటి ప్రసాద్, నీరటి ప్రసాద్, యాస అంజయ్య పాల్గొన్నారు.

భూదాత కాంస్య విగ్రహం ఆవిష్కరణ

ఇల్లంతకుంట, జూలై 19: మండలంలోని పెద్దలింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒల్లాద్రి వెంకట్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని శుక్రవారం కుటుంబీకులు, గ్రామస్థులు ఆవిష్కరించారు. వెంకటరెడ్డి 1982లో పాఠశాలకు 60 గుంటల స్థలాన్ని విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జితేందర్‌గౌడ్, కుటుంబీకులు హరిచంద్రారెడ్డి, కమల్‌మోహన్ రెడ్డి, రాజమహేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సుజాత, రాజమోహ న్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బోయినపల్లి, జూలై 19: బోయినపల్లి మండలం మర్లపేట గ్రామానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రూ.50 వేల ఆర్థిక సాయా న్ని అందజేశారు. బాధిత అదుకోవాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు కొనకటి హరీష్ కేంద్ర మంత్రి దృష్టి తీసుకెళ్లారు. ఈ మేరకు చెక్కును బీజేపీ మండల అధ్యక్షుడు గూడి రవీందర్‌రెడ్డి, నాయకులు నర్సింహాచారి, హరీష్ అందజేశారు.

రేపు గూగుల్ మీట్ ద్వారా కవి సమ్మేళనం

కరీంనగర్ కల్చరల్, జూలై 19: మహాకవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకలు ప్రారంభమవుతున్న సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో గూగుల్ మీట్ ద్వారా కవి సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దార్ల వేంకటేశ్వర్‌రావు, అతిథులుగా కాంచనపల్లి గోవర్ధనరాజు, నాగిళ్ల రామశాస్త్రి, గంటా మనోహర్‌రెడ్డి హాజరౌతారని పేర్కొన్నారు. వివరాలకు 9014559059 నెంబర్లో సంప్రదించాలని, కవులు, రచయితలు విజయవంతం చేయాలని కోరారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

సుభాష్‌నగర్, జూలై 19: నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బ్రాహ్మణపెల్లి యుగేందర్ కోరారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం కింద 8 రకాల పోస్టులను భర్తీ చేయడానికి ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున భర్తీ ప్రక్రియను నిలిపివేశారన్నారు. అయితే ఇతర జిల్లాలైన మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లిలో నియమక ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు కాలయాపన చేయకుండా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా మైసమ్మ బోనాలు


బోనాలు సమర్పిస్తున్న చైర్ పర్సన్, ఉద్యోగులు

సిరిసిల్ల టౌన్, జూలై 19: సిరిసిల్ల మున్సిపల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం మైసమ్మ బోనాల పండుగను నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మైసమ్మ దేవాలయానికి మున్సిపల్ మహిళా ఉద్యోగులు బోనాలతో తరలి వెళ్లారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలను గౌరవిస్తూ సమాజహితం కోరుకుంటూ మున్సిపల్ ఉద్యోగులు మైసమ్మ బోనాల పండుగను నిర్వహించుకున్నార న్నారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, పాలక వర్గం సభ్యులు, ప్రజల ఆరోగ్యం లక్ష్యంగా పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పారదర్శకంగా సేవలను అందిస్తున్నారన్నారు. వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు రాకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని, డ్రైడే వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ అధికార యంత్రాంగం అప్రమత్తం ఉందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ లావణ్య, పట్టణ ప్రణాళికా అధికారి అన్సారీ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడగట్ల మురళి, కౌన్సిలర్లు గుండ్లపెల్లి నీరజ, లింగంపల్లి సత్యనారాయణ, అడ్డగట్ల మాధవి, దిడ్డి మాధవి, బీఆర్ఎస్ నాయకులు గుండ్లపెల్లి పూర్ణచందర్, దిడ్డి రాజు, ఆర్‌వో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవోకు విరుద్ధంగా డిప్యూటేషన్‌లు

వేములవాడ కల్చరల్, జూలై 19: వేముల వాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో జీవోకు విరుద్ధంగా డిప్యూటేషన్‌లు ఇస్తున్నారని ఆలయ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ టీఎన్‌జీవో కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న పలు విషయాలపై తీర్మానం చేసినట్లు తెలిపారు. మండలంలోని అగ్రహారం హనుమాన్ ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్ రాజన్న ఆలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తించేందుకు దరఖాస్తు చేసుకోవడాన్ని తప్పుబట్టారు. చిన్న దేవాలయాల్లోని ఉద్యోగులను పెద్ద దేవాలయంలో విధులకు అనుమతించరాదని జీవో నంబరు 64 ప్రకారం నిబంధనలు ఉన్నాయని సమావేశంలో పలువురు ఉద్యోగులు వాదించారు. ఈ విధానం కొనసాగితే చిన్న ఆలయాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చి తిష్ట వేసే అవకాశం ఉందని, ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దని మరికొంత మంది ఉద్యోగులు వాదన వినిపించినట్లు తెలిపారు. కావాలని కొంత మంది తమకు దగ్గరి వారిని తీసుకొచ్చి రాజన్న ఆలయంలో పెట్టేందుకు పైరవీలు చేస్తున్నారనే ఆరోపించారు. ఈ సంఘటనపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను, ఈవో వినోద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అంద జేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు సం ఘం ప్రధాన కార్యదర్శి కూరగాయాల శ్రీనివాస్ తెలిపారు. ఏటా ఆషాఢ బోనాలను ఈ నెల 26వ తీసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులకు విశ్వాసం

సిరిసిల్ల టౌన్, జూలై 19 : రైతు రుణమాఫీతో తెలంగాణలోని రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం కలిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రాష్ట్రంలోని ప్రతీ రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తా మని హామీ ఇచ్చిందన్నారు. ఇందులో భాంగా మొదటి దఫాగా లక్ష రూపాయల రుణమాఫీ చేయడంపై సీపీఐ హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. రాష్ట్రంలో దాదాపు 64 లక్షల రైతు కుటుంబాలకు లాభం చేకూరుతుందన్నారు. ఆగస్టు 15లోగా రెండు లక్షల రుణమాఫీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులకు పూర్తి నమ్మకం కలుగుతుందన్నారు. రైతులు పండించిన పంటకు కూడా గిట్టుబాటు ధరతోపాటు బోనస్‌ను అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, వెంటనే అమలు చేయాలని అన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలన్నారు. నకిలీ ఎరువులు, క్రిమి సంహారక మందులను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు అజ్జ వేణు, రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూర్ రంజిత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

రైతు రుణమాఫీ హర్షనీయం

చందుర్తి జూలై 19: రైతులకు రుణమాఫీ చేయడం హర్షనీయమని మాజీ ఎంపీపీ చిలక పెంటయ్య అన్నారు. చందుర్తిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఇస్తానన్న ఎకరాకు రూ.15,000 రైతు భరోసా డబ్బులు జమ చేయలేదన్నారు. వెంటనే రైతుల డబ్బులు జమ చేయాలని కోరారు. పప్పుదినుసుల ధరలు పెరుగుతున్నందున రైతులకు ఉచితంగా పెసర, కందులు విత్తనాలను అందజేయాలన్నారు.

వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై నేడు బీజేపీ దీక్ష

సిరిసిల్ల రూరల్, జూలై 19: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఒకరోజు దీక్ష చేపట్టనున్నామని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ శుక్రవారం ప్రకటించారు. సిరిసిల్ల పట్టణంలోని సెస్ ఆఫీస్ ఎదుట దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేసి సిరిసిల్లలో నెలకొన్న వస్త్ర పరిశ్రమ సంక్షోభంతోపాటు బతుకమ్మ చీరల బకాయిలు, విద్యుత్ సబ్సిడీ ఎత్తివేత, మరమగ్గాల కార్మికుల పది శాతం యారన్ సబ్సిడీ వంటివాటిపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించనున్నట్లు తెలిపారు. కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాని దీక్షను చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రక్త హీనత అధిగమించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి

ముస్తాబాద్, జూలై 19 : రక్త హీనతను అధిగమించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని ముక్త్ భారత్ మండల కోర్స్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఎంఆర్సీలో ఎంఈవో బన్నాజీ అధ్యక్షతన అనిమియా ముక్త్‌భారత్, అనమియా ముక్త్ తెలంగాణ అనే కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. మండల నోడల్ అధికారి రాజిరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాధకిషన్‌రావు, రాజేశ్వరి, హెచ్‌ఎంలె, కాంప్లెక్స్ సీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కోనరావుపేట జూలై 19: కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఎర్రవెల్లి అక్షిత, లక్కం అక్షయ ట్రిపుల్ ఐటీ సీటు సాధించగా సుద్దాల మాల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు మాల సంఘం నాయకులు ఎర్రవెల్లి నాగరాజు, ఎర్రవెల్లి రాజయ్య, ఎగదండి రవీందర్ మహిపాల్, జగన్, కిషన్, మురళి, రాజు, పవన్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

28న ముస్లిం కమిటీ ఎన్నికలు

వేములవాడ టౌన్, జూలై 19 : వేములవాడ ముస్లిం కమిటీ ఎన్నికలను ఈ నెల 28న స్థానిక ఉర్దూ మీడియం స్కూల్‌లోనిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు పోలింగ్, ఓట్ల లెక్కింపు ఉంటాయని పేర్కొన్నారు. శుక్ర, శనివారాల్లో ఉద యం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులు సయ్యద్ సాధిక్, సయ్యద్ బాబా, ఎండీ రఫీక్, షకీల్, అజ్మత్, ఇష్తికార్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, జూలై 19: మండలంలోని పొత్తూర్‌లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను శుక్రవారం స్వాధీనం చేసుకొని నిందితులైన చిట్యాల అంజయ్య, కుంభం శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రూ.2 లక్షల రుణమాఫీ చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం

సిరిసిల్ల టౌన్, జూన్ 19: రూ.2లక్షల రుణమాఫీ చేసే వరకు రైతుల తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేడీసీసీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.లక్ష వరకు రుణమాఫీ ప్రకటించడంపై హర్షిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2014, 2018లో రెండు పర్యాయాలు రైతు రుణమాఫీ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 11లక్షల మంది రైతులకు మాత్రమే లక్ష రూపాయలలోపు ఉన్నారనడంలో పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. రైతు రుణమాఫీ లిస్టును ప్రభుత్వం ఎందుకు గోప్యంగా ఉంచుతోందని ప్రశ్నించారు. జిల్లాలో చాలా మంది లబ్ధిదారుల రైతు రుణమాఫీ కానట్లు తెలిసిందన్నారు. లక్ష రూపాయలలోపు ఉన్న రైతుల రుణాలను రూ. 32 వేల కోట్లు మాఫీ చేశామని ఒకరి కంటే ఒకరు గొప్పగా చెప్పుకుంటున్నారని, నిన్న మాత్రం దాదాపు రూ.6వేల కోట్లు మాత్రమే రైతుల ఖాతాలకు వచ్చాయని, మిగతావి ఆగస్టు 15లోపు అంటున్నారని అన్నారు. మంగళవారం నుంచి అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ శాసన సభ్యులు రైతుల తరఫున ప్రశ్నించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు దఫాలుగా దాదాపు రూ.23వేల కోట్లు రైతు రుణమాఫీ చేసిందన్నారు. రైతు బంధు రూ.7.50వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించిందని, అందులో నుంచి రూ. 6వేల కోట్లు రైతు రుణమాఫీ కింద ఇచ్చిందని ఆరోపించారు. దీనికి దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసిందని క్షీరాభిషేకాలు చేశారంటూ ఎద్దేవా చేశారు. రైతులకు నాణ్యమైన కరెంట్ అంది ంచడంలో, ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. కమిషన్ల మీద కమిషన్లు వేస్తూ కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రెండు రోజుల్లో గ్రామాలు, మండలాల వారీగా బ్యాంకుల వారిగా రుణమాఫీ కానీ రైతుల లెక్కలు తీసి మీడియా సమక్షంలో ప్రభుత్వానికి, అధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు గజభీంకర్ రాజన్న, కుంబాల మల్లారెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న ఆగయ్య, రవీందర్‌రావు

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వేములవాడ టౌన్, జూలై 19: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. శుక్రవారం నందికమాన్ సమీపంలో నిర్వహించిన వేములవాడ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ప్రజల ఆగ్రహానికి లోనవుతోందని, ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ఉనికి లేకుండా పోయిందని, ప్రజలకు బీజేపీపైనా, ప్రధాని నరేంద్ర మోదీపైనా నమ్మకం కలిగిందని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. వేములవాడ అర్బన్ మండలంలోని నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. ఎన్నికల హామీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చేలా బీజేపీ నాయకత్వం పాటుపడాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, జింక అనిల్, బుర్ర శేఖర్, మోహన్‌రావు, గుండెకర్ల లక్ష్మణ్, కాచం నిఖిల్, సంతోష్‌యాదవ్, రెడ్డవేని రాజు, రాగుల పర్శరాములు, నిఖిల్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ